క్లుప్తంగా

సీఈవోగా ఆకుల రమణ

మధురపూడి: కోరుకొండ పీఏసీఎస్ సీఈవోగా ఆకుల రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన సుధాకర్ వర్మ గత నెలలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆకుల రమణ కొత్త సీఈవోగా నియమితులయ్యారు. ఈ సొసైటీ పరిధిలో కోరుకొండ, బుచ్చెంపేట, కాపవరం, జంబూపట్నం, పశ్చిమగానుగూడెం, నర్సాపురం, గాదరాడ, కణుపూరు. రాజవరం గ్రామాలున్నాయి. కాగా.. సుధాకర్ వర్మ పదవీ విరమణ అభినందన సభను ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ



రంగంపేటలో పీహెచ్‌సీ అదనపు భవనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

బిక్కవోలు: రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన అదనపు భవనాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డీఈఈ టి.సురేష్, జేఈ ఎండీ అహ్మద్, మండల పంచాయతీరాజ్ జేఈ శ్రీనివాసరావు భవన నిర్మాణ నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పంట సంరక్షణకు చర్యలు చేపట్టాలి



డాక్టర్ వెంకట నరసింహారావు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

రాజానగరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయని, తక్షణమే ముంపు నీటిని తొలగించేలా చర్యలు చేపట్టి, పంటను సంరక్షించుకోవాలని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, రైతులకు ఇచ్చిన సూచనలు, సలహాలను ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు శనివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ముంపునకు గురైన పొలాలలో నీరు దిగువకు పోయిన తరువాత బూస్టర్ డోస్ రూపంలో ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి చల్లాలన్నారు. అనంతరం తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు ఒక లీటర్ నీటిలో కార్బండిజమ్ ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ముంపునకు గురైన వరినాట్లు దెబ్బతింటే, నారుకోసం చూడకుండా నేరుగా విత్తనాలను చల్లడం మంచిదని సూచించారు. ఇందుకు ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 వంటి వరి వంగడాలు ఎంతో శ్రేష్ఠమన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ



చంద్రేడులో శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ

బిక్కవోలు: మండలంలోని చంద్రేడు గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి కనకదుర్గ అమ్మవారు శనివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు సమర్పించిన వివిధ కూరగాయలు, ఆకుకూరలతో అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

శాంతించని అనకొండ

- కొండ గోదారి ముంపులోనే 13 వేల ఎకరాలు
- ఆందోళనలో రైతులు



రాపాక గ్రామంలో ముంపులోనే ఉన్న వరి పొలాలు



మిర్తిపాడులో కొండగోదారి వల్ల ముంపునకు గురైన చేలు



రాపాకలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

సీతానగరం: అధిక వర్షాలు, ఎగువ నుంచి వచ్చిన నీటితో ఉధృతంగా ప్రవహించిన గోదావరి శాంతించింది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ముంపునకు గురైన పంట పొలాలు తేరుకుంటున్నాయి. కానీ రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ మండలాలలోని సుమారు 13 వేల ఎకరాలు ముంపు నుంచి తేరుకోలేదు. కొండ గోదారి ఉధృతి తగ్గకపోవడమే దీనికి ప్రధానం కారణం. దీంతో వేసిన వరినాట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి దాదాపు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండ గోదారి

సాధారణంగా గోదావరిలో వరద నీరు పెరిగినప్పుడు బొబ్బిల్లంక స్లూయిజ్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుపోతాయి. దీనితో కొండగోదారి నీరు గోదావరిలో కలిసే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో కొండ గోదారి వెనక్కు తన్నుతుంది. దాని ఎగపోటు కారణంగా సీతానగరం, కోరుకొండ మండలంలోని పొలాలు ముంపునకు గురవుతాయి. మండలంలో కురిసిన వర్షంతో పాటు గోకవరం, కోరుకొండ మండలాల నీటితో పాటు సూరంపాలెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన మిగులు జలాలన్నీ బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి.

ముంపులో పొలాలు

అటు గోదావరి వరద, ఇటు కొండ గోదావరితో సుమారు 13 వేల ఎకరాలు ముంపులోకి వెళ్లాయి. అలాగే సుమారు 500 ఎకరాలలోని ఉద్యాన పంటలు, అరటి తోటలు, కూరగాయల పాదులు నీటమునిగాయి. సీతానగరం మండలం పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి, రాపాక, రఘుదేవపురం, నల్గొండ, మిర్తిపాడు, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, కూనవరం గ్రామాల్లో పొలాలు ఇంకా తేరుకోలేదు. కోరుకొండ మండలంలోని ఎనిమిది గ్రామాలకు పంట పొలాలదీ ఇదే పరిస్థితి.

రైతుల అవస్థలు

ముంపులోకి వెళ్లిన 13 వేల ఎకరాల పంట ఎందుకు పనికిరాదని ప్రాథమికంగా తెలవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నీటి లాగిన తర్వాత మళ్లీ నాట్లు వేసేందుకు వరిఆకు కోసం మెరక ప్రాంతమైన గోకవరం, జగ్గంపేట, కోరుకొండ మండల గ్రామాల్లో ఆరా తీస్తున్నారు. ఆ ప్రాంత రైతులు ఉచితంగా కొంతమంది, మరికొందరు ఎకరానికి రూ 2 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. మరికొంత మంది రైతులు ఆకుమడికి అయిన ఖర్చు ఇచ్చి తీసుకువెళ్లాలని అంటున్నారు. అయితే ముంపులో ఉన్న ప్రతి ఎకరానికి వరి ఆకు దొరుకుతుందో లేదో తెలియదు.

రైతులను ఆదుకోవాలి

పొలాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. ఆయన ఈ నెల ఒకటిన కూనవరం, రాపాక, కాటవరం, చిన కొండేపూడి, బొబ్బిల్లంక గ్రామాల్లో ముంపులో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పటి కప్పుడు రైతులకు నష్టపరిహారాన్ని ఆయా సీజన్లలోనే అందించారన్నారు.

ముంపు నుంచి తేరుకోలేదు



ఏడు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి పంట వేశాను. గోదావరి వరద తగ్గినా కొండ గోదావరి అలాగే ఉండటంతో వరిపంట నాశనమైంది. ఏడు ఎకరాల్లోని వరిపంట కుళ్లిపోతోంది. ఎకరానికి రూ.15 వేలు ఖర్చు చేశాను. అందిన కాడిని అప్పులు చేసి కౌలుకు తీసుకున్నాను. వరినాట్లు వేసి ఇరవై రోజులు కాకుండానే ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– సూలా దుర్గారావు, కౌలు రైతు, సీతానగరం

వరి ఆకు దొరకడం కష్టమే



పది ఎకరాలలో వరిపంట వేయగా అధిక వర్షాలతో ముంపులోకి వెళ్లింది. వీటిలో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకున్నాను. ఎకరానికి రూ.30 వేలు శిస్తుగా చెల్లించాను. పెట్టుబడిగా రూ.15 వేలు ఖర్చు చేశాను. తిరిగి వరినాట్లు వేయాలంటే వరిఆకు దొరకడం కష్టమే. అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోయాను.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు, మిర్తిపాడు

నీటి ప్రవాహంలో చిక్కుకుని ఎద్దు మృతి



కల్వర్టు వద్ద నీటి ప్రవాహంలో చిక్కుకుని మృతి చెందిన ఎద్దు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి– చీపురుపల్లి మధ్య గల అప్పన్న చావిడి వద్ద ఉన్న కల్వర్టు నీటి ప్రవాహంలో చిక్కుకుని ఎద్దు మృతి చెందింది. సీతానగరానికి చెందిన పేరిచర్ల వెంకట్రాజు శనివారం ఆ కల్వర్టు మీదుగా తన ఎడ్లబండిపై పొలాలకు ఎరువులను తీసుకువెళ్లాడు. తిరిగి వస్తుండగా కల్వర్టులో నీటి ప్రవాహానికి బండి లాగుతున్న ఎద్దులు కంగారుపడ్డాయి. దీంతో ఒక ఎద్దు శీల ఊడిపోవడంతో అది బండి నుంచి విడిపోయిన ఒడ్డుకు వచ్చేసింది. మరో ఎద్దు శీల అలాగే ఉండిపోవడంతో పాటు దాని మెడకు ఉన్న తాడు బిగిసిపోయింది. ఇదే సమయంలో బండి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. వెంటనే వెంకట్రాజు కిందకు దూకేశాడు. అనంతరం కొందరి సాయంతో బండిని, ఎద్దును ఒడ్డుకు లాక్కునివచ్చారు. కానీ అప్పటికే ఎద్దు మృతి చెందింది. దాని విలువ రూ.1.10 లక్షలు ఉంటుందని అంచనా.

దంతాల సంరక్షణపై అవగాహన తప్పనిసరి



దంత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంఈఓ–2 సత్యనారాయణ

పెదపూడి: దంతాల సంరక్షణపై అందరూ అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటించాలని మండల విద్యాశాఖాధికారి–2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. పెదపూడి, కైకవోలు, కరకుదురు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) కాకినాడ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్రప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. శిబిరంలో 196 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసిన అవసరమైన వారికి టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచి దంతాలను కాపాడుకోవాలన్నారు. ఏ ఆహారం తీసుకోవాలి, ఏ పానీయాలు తాగాలి, ఏ విధంగా దంతాలు శుభ్రం చేసుకోవాలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదపూడి, కై కవోలు ప్రధానోపాధ్యాయులు, కె.సత్యనారాయణ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పీఈటీ ఉపాధ్యాయుడు గిరి, విశ్రాంత ఉపాధ్యాయుడు కోరా రుద్రయ్య చౌదరి, సిబ్బంది మండపల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, నోట్ పుస్తకాలను శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పంపిణీ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.స్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శనివారం ప్రజావాణి నిర్వహించారు. మండలంలోని ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు.

నిబంధనల ప్రకారం సామాజిక తనిఖీ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి నిబంధనల ప్రకారం గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారన్నారు. దీనికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, స్టేట్ రిసోర్స్ పర్సన్ సింహాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో ప్రాచీన వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శనివారం సందర్భంగా ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేక అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కార్యాలయాల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టాలి

మధురపూడి: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ఏర్పాటు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి కోరారు. అధికారులు ఈనెల పదో తేదీలోపు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీజేపీ నాయకులే మోదీ ఫొటోలను పెడతారన్నారు.

అమ్మపేరుతో మొక్కను నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న నన్నయ వీసీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు

రాజానగరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వీసీ బంగ్లా ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని కలిగిస్తున్నామన్నారు. అటవీ, వ్యవసాయ భూములు తరిగిపోవడమే ఆక్సిజన్ శాతం తగ్గిడానికి, నీరు భూమిలో ఇంకక పోవడానికి కారణాలవుతున్నాయన్నారు. తద్వారా అనేక అనారోగ్య సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కేఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కామరాజుపేటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గోకవరం: కామరాజుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీఓ పి.వరలక్ష్మి పాల్గొని తల్లిపాల ఆవశ్యకతలపై తల్లులకు అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలను విధిగా పట్టించాలని, తల్లిపాలే చిన్నారులకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినులకు బాల్య వివాహాలు, ప్రపంచ అవయవదాన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.చంద్రమ్మ, డీసీపీయూ అధికారి ఎస్.పావని, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం

రాజానగరం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం చాలా ముఖ్యమని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), గృహ విభాగం సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టు డాక్టర్ సంజయ్ హెగ్డె అన్నారు. కలవచర్లలోని అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పర్యవేక్షణలో శనివారం కేవీకేలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ తల్లి పాలలో బిడ్డకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సరైన నిష్పత్తిలో లభిస్తాయన్నారు. పిల్లలను అలర్జీ, అనారోగ్యం, ఊబకాయం, డయాబెటీస్, క్యాన్సర్ తదితర వ్యాధుల నుంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత మహిళలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, తల్లిపాల ఆవశ్యకత అనే అంశాలపై కేవీకేలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, మహిళా సంరక్షణ కార్యదర్శి వై.రేణుకాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి.రెజీనా పాల్గొన్నారు.

పందలపాకలో అగ్ని ప్రమాదం

బిక్కవోలు: మండలంలోని పందలపాక 16 ఎకరాల కాలనీలో అగ్ని ప్రమాదం జరిగిందని అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం పందలపాక గ్రామానికి చెందిన బసవ వీరభద్రరావు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు సమాచారమివ్వడంతో అగ్నిమాపక అధికారులు అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు.

గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

గోకవరం: స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ విజ్ఞంభణ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. పీడీఎస్‌యూ విజృంభణ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ గోకవరంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే ఈ పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామంలో డిగ్రీ కళాశాల లేకపోవడం వలన సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమహేంద్రవరం, జగ్గంపేట, రంపచోడవరం వెళ్లి విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

ట్రావెల్ బస్సు బోల్తా

రాజానగరం: జాతీయ రహదారిపై రాజానగరం శనివారం రాత్రి ట్రావెల్ బస్సు తిరగబడింది. దానిలోని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఫుడ్ కోర్టు సమీపంలో కార్లు ఆగి ఉన్నారు. ఆ దారిలో హైదరాబాద్ వెళుతున్న ట్రావెల్ బస్సు ఆ కార్లను తప్పించడానికి నెమ్మది అయ్యింది. ఇంతలో వెనుకనుంచి ఆ బస్సును మరో బస్సు ఢీకొంది. ఈ ఘటనలో వెనుక ఢీకొన్న బస్సు బోల్తా పడడంతో డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు.

వరాహలక్ష్మీ నారసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



వరాహ లక్ష్మీనారసింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో ప్రసిద్ధి చెందిన తిరుమలాచలం కొండపై ఉన్న అమృతవల్లీ, రాజ్యలక్ష్మీ సమేత శ్రీవరాహ నారసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి విశేష సంఖ్యలో కొండకు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వీరమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.